క్లుప్తంగా

రేపటి నుంచి అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవం

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్రావాండ్లపల్లి నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారి మూలవిగ్రహం గ్రామోత్సవం, సాయంత్రం గణపతిపూజ, గోపూజ, కళశ స్థాపన, విగ్రహములకు జల, క్షీరాధివాసములు, బుధవారం ఉదయం ప్రధాన కళశ స్థాపన, శిఖర కళశ స్థాపన, సాయంత్రం మండప దేవతా హోమాదులు, గురువారం ఉయత్వారం విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె: మండల న్యాయసేవా సంఘం తంబళ్లపల్లె జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో పారాలీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, స్థానిక ఇన్‌చార్జ్ న్యాయమూర్తి హసిఫాసుల్తానా కోరారు. పదోతరగతి పాసై 18ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 28వ తేదీలోపు స్థానిక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వారు పనిచేసిన రోజులకు నిర్ణయించబడిన వేతనం ఇస్తారన్నారు. వివరాలకు మండల న్యాయసేవా సంఘం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సంప్రదించాలన్నారు.

టెన్త్ ఫీజు చెల్లింపునకు 26 వరకు గడువు

పెద్దతిప్పసముద్రం: పదవ తరగతి విద్యార్థులు ఈ నెల 23 నుంచి 26 వరకు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఎంఈఓ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు దాటితే అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మురళికిషోర్ తెలిపారు. అక్రమ సారా విక్రయాలపై అందిన సమాచారం మేరకు పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలోని నారాయణమ్మ(40) ఇంటిలో ఆదివారం సోదాలు నిర్వహించగా సారా లభించినట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక ఆదివారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని దేవులచెరువుకు చెందిన మల్‌రెడ్డి(50) తన ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి 13 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష

కురబలకోట: మండలంలో ఆదివారం మిట్స్, విశ్వం కళాశాలల్లో జరిగిన సివిల్, ఎపీఎస్పీ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయి. డీఎస్పీ కేశప్ప పర్యవేక్షించారు. 2500 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్లు పోలీసులు తెలిపారు.

గర్నిమిట్ట యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి అంతర్ జిల్లా బాల్ బాడ్మింటన్ పోటీలు

మదనపల్లె సిటీ: స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి 25వ తేదీ వరకు 66వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా బాల్ బాడ్మింటన్ అండర్-17 బాల,బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం.వసంత తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అలాగే డీఈఈఓ రాఘవరెడ్డితో పాటు పీడీలు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పంట నమోదు.. బహుళ ప్రయోజనాలు

- పంట నష్టపోతే పరిహారం అందే అవకాశం
- ఈక్రాప్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో రుణాలు
- కౌలు రైతులకు పరిహారం వర్తింపు



ఎల్లుట్లలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు



ఆర్బీకేల్లో సబ్సిడీ ఎరువులను రైతులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుర్రంకొండ: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు ఈ-క్రాప్ నమోదుతో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. పంటలు నష్టపోతున్న రైతులకు ఈ-క్రాప్ వరంగా మారుతోంది. ప్రస్తుతం రబీసీజన్ ప్రారంభం కావడంతో ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు ఉమ్మడిగా ఈ -క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ గత పది రోజులుగా ముమ్మరంగా సాగుతోంది. పంటల సాగు వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తాము పండించిన పంటలు నష్టపోతే ప్రభుత్వం సాయం అందించడానికిగానూ వీలుంటుంది. ఈక్రాప్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో పంట రుణాలుకూడా పొందే అవకాశముంది. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు పంటనష్టపరిహారం అందనుండడం గమనార్హం.

ప్రయోజనాలు ఇలా

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు నేరుగా నష్టపరిహారం పొందే వెసులు బాటు ఉంటుంది. దళారుల చేతికి భీమా పరిహారం అందదు. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతుల తరపున బీమా సొమ్ము చెల్లిస్తోంది. దీంతో పంటనష్టపోయినప్పుడు గతంలో ఈ క్రాప్ ద్వారా నష్టపోయిన రైతు ఎంత మేరకు పంట సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. అలాగే పంట మార్పిడికి వీలుంటుంది. పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముంటుంది. పైగా దిగుబడుల అంచనాకు ఇది సరైన విధానం. ఎరువులు, పురుగుల మందులు, ఎంతమేరకు అవసరం అవుతాయో ఆయా పరిధిలోని ఆర్‌బీకేలకు తెలిసే అవకాశముంది.

రైతులకు ప్రభుత్వం ఆసరా

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రభుత్వం రబీ సాగుపై దృష్టి సారించింది. ఇందు కోసం రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాల, ఎరువులు అందుబాటులోకి తెచ్చి ఆసరా కల్పించింది. ప్రభుత్వం పంటల సాగు కోసం అవసరమైన సబ్సిడీ ఎరువులు ఆర్‌బీకేలకు సరఫరా అయ్యాయి. రైతులకు అందుబాటులోకి సబ్సిడీ ఎరువులు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకు పరిహారం

గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా గత మూడేళ్లుగా ప్రస్తుత ప్రభుత్వం కౌలురైతులకు పంట నష్టపరిహారం అందిస్తుండడం గమనార్హం. గతంలో పొలాన్ని కౌలు రైతులు కౌలుకు తీసుకొన్నా పంట నష్టపరిహారం మాత్రం యజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలురైతుల గుర్తింపు కార్డులు జారీచేస్తే ఈ క్రాప్ నమోదులో ఆన్‌లైన్ సదరు పొలం కౌలురైతులకు ఇచ్చినట్లు చూపిస్తోంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలురైతుల పేరు మీదే ఈక్రాప్ నమోదు చేస్తుండడం గమనార్హం.

ఈక్రాప్ సర్టిఫికెట్‌తో పంటరుణాలు

ప్రస్తుత రబీసీజన్‌లో చేపట్టిన ఆన్‌లైన్‌లో ఈక్రాప్ బుకింగ్‌తో రైతులకు పంట రుణాలు కూడా మంజూరు అవుతున్నాయి. వ్యవసాయశాఖ సిబ్బంది జారీచేసే ఈక్రాప్ బుకింగ్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో కొత్తగా పంటరుణాలు మంజూరు చేయడంతోపాటు పాత రుణాలు కూడా రెన్యూవల్ చేసేందుకు ఈప్రక్రియ దోహద పడుతోంది.

60 శాతం పూర్తి

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఈ-క్రాప్‌నమోదు ప్రక్రియ 60 శాతం వరకు పూర్తి అయ్యింది. రబీసీజన్‌లో నియోజకవర్గంలో అన్ని రకాల పంటల సాగు మొత్తం విస్తీర్ణం 8329 ఎకరాలు ఉంది. ఇందులో ఇప్పటివరకు 4725 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయ్యింది. ఇంకా 10 రోజుల వరకు ఈక్రాప్ నమోదు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనేందుకు ప్రభుత్వం గడువు పొడిగించింది.

నియోజకవర్గంలో ఈ-క్రాప్ నమోదు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-క్రాప్ నమోదు (ఎకరాల్లో)
గుర్రంకొండ	1050	500
పీలేరు	1850	980
వాల్మీకిపురం	1345	785
కలికిరి	1436	857
కేవిపల్లె	1523	982
కలకడ	1125	621

రైతులకు ఎంతో ప్రయోజనం



ఈ-క్రాప్ నమోదుతో మాకు ఎంతో ప్రయోజనం చేకురుతోంది. బీమా సొమ్ము చెల్లించక పోయినా ప్రభుత్వమే రైతుల తరపున బీమా సొమ్ము చెల్లించడం ఆనందంగా ఉంది. పంటలు నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే తమను ఆదుకొంటోంది.

- గోపాల్, సుంకరవాండ్లపల్లె

కౌలు రైతులకు న్యాయం



గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలురైతులకు ఈ-క్రాప్ ద్వారా న్యాయం జరిగింది. తాము సాగుచేసిన పంటను పరిశీలించి పంటన మోదు చేస్తున్నారు. తద్వారా అర్హులైనకౌలు రైతులందరికీ న్యాయం జరుగుతోంది. పంటనష్టం జరిగితే నేరుగా కౌలురైతులకే పరిహారం ఇస్తున్నారు.

- నరేంద్ర, కౌలురైతు, దౌలత్‌ఖాన్‌పల్లె

రైతులకు ఈక్రాప్ వరం

ఈక్రాప్ నమోదు చేసుకోవడం వలన రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా రైతు భరోసా, పంట నష్టపరిహారం తప్పనిసరిగా రైతులకు అందుతాయి. కౌలురైతులకు కుడా రైతుభరోసాతో పాటు పరిహారం కూడా వస్తుంది. రైతులందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- రత్నమ్మ, వ్యవసాయాధికారి, గుర్రంకొండ

ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు రూరల్ : సమష్టి కృషితో ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దామని పీలేరు, వాల్మీకిపురం సీఐలు మోహన్‌రెడ్డి, సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో 34వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో, ట్యాక్సీ, ఆర్టీసీ, ప్రవైట్ బస్సు డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2022వ సంవత్సరంలో 727 ప్రమాదాలు జరిగి 346 మంది చనిపోయారు. అందులో కేవలం ద్విచక్రవాహనాల ద్వారా 206 ప్రమాదాలు జరిగితే 188 మంది మృతి చెందినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించని వారే ఎక్కువగా చనిపోయారని గుర్తు చేశారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులకు హాజరయ్యే డ్రైవర్లు మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో వెళ్లాలని సూచించారు. డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బి. కుమార్, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎంవీఐ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

త్వరలో వందపడకల ఆస్పత్రి పనులు పూర్తి

డీఈఈ పి. కరీముల్లా ఖాన్

పీలేరు రూరల్ : మదనపల్లె డివిజన్‌లో జరుగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులను ఏప్రిల్ లోపు పూర్తిచేస్తామని ఏపీ వైద్య మౌలిక వనరుల అభివృద్ధి సంస్థ డీఈఈ పి. కరీముల్లా ఖాన్ అన్నారు. ఆదివారం పీలేరు వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాల్మీకిపురంలో రూ. 7 కోట్లతో 50 పడకల ఆస్పత్రి, తంబళ్లపల్లెలో రూ. 4.60 కోట్లతో 50 పడకల ఆస్పత్రి పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి రెండు మార్చి ఆఖరుకల్లా పూర్తి అవుతాయని తెలిపారు. పీలేరులో రూ. 24 కోట్లుతో వందపడకల ఆస్పత్రి, కలికిరిలో రూ. 6.40 కోట్లతో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు ఏప్రిల్ ఆఖరు నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పీలేరు వంద పడకల ఆస్పత్రికి ప్రహరీ, డ్రైనేజ్, సీసీ రోడ్లు, ఎంట్రన్స్ ఆర్చి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు.

నూతన రచయితలకు గ్రంథ అధ్యయనం తప్పనిసరి

మదనపల్లె సిటీ: సాహితీ రంగంలోకి నూతనంగా ప్రవేశించే వారికి గ్రంథ అధ్యయనం దీపదారి వంటిదని, కలానికి బలాన్ని ఇవ్వగల అమృతం వంటిదని ప్రముఖ నవలా రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య ప్రవంతి ఆధ్వర్యంలో యువ రచయిత మంజు ప్రీతం రచంచిన ×తనేగా ప్రాణం× వచనా కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ రచనలపై పుస్తక రచయిత ఆసక్తి పెంచుకోవడం అభినందనీయమన్నారు. ఇలాంటి యువ రచయితలు రచనలు చేయడానికి ముందుకు రావాలన్నారు. గ్రంథ రచయిత తొలి ప్రయత్నంలోనే మంచి కవితా సంపుటిని అందించడం ముదావహం అన్నారు. ఇటీవలి కాలంలో ఆశాజనకంగా నూతన రచయితలు ముందుకొస్తున్నారని తెలిపారు. నిజజీవితంలో యధార్థ ఘటనలు ఆధారంగా రాయడం గొప్ప విషయమన్నారు. కథా రచయిత,విమర్శకులు వేంపల్లి సికిందర్ మాట్లాడుతూ గ్రంథ సమీక్షకావిస్తూ గ్రంథంలోని చమత్కారాలను, ప్రేమాభివేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, గ్రంథాలయాధికారి వసంత, చంద్రశేఖరశర్మ, ప్రసాదరావు, మునిగోపాలకృష్ణ, ప్రభాకర్, రాజేంద్ర,నాగభూషణరావు పాల్గొన్నారు.



కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితలు

తెలుగుభాషకు గిడుగు సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి సేవలు ప్రశంసనీయమని ప్రముఖ రచయిత వీఎం .నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి వర్ధంతి పురస్కరించుకుని నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాలకే పరిమితమైన చదువును బడుగు బలహీన వర్గాలను దగ్గర చేశారన్నారు. భాష ద్వారా సామాజిక అంతరాలను తగ్గించి, తెలుగు నేలను అభ్యుదయం వైపు నడిపించారన్నారు. కార్యక్రమంలో మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి, కరుణాకర్, శ్రీధర్, కిజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడును బలోపేతం చేద్దాం

వాల్మీకిపురం: మాలమహానాడును విస్తృతం చేసి బలోపేతం చేద్దామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శన్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలమహానాడు జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేసి, మాలలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతపర్తి శివయ్య, సంజీవ్, వీరభద్రయ్య, చంద్రయ్య, మోహన్, శివారుపల్లి సుధాకర్, రఘు, సునీల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

38 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక

బి.కొత్తకోట: వారంతా 38 ఏళ్ల క్రితం హైస్కూలు విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు. ఆదివారం హార్సిలీహిల్స్‌పై అందరూ సమావేశమై నాటి మధురానుభూతులు పంచుకున్నారు. మదనపల్లె జీఆర్‌టీ హైస్కూల్లో 1979-80 నుంచి 1983-84 వరకు కలిసి చదువుకొన్న అప్పటి విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విడిపోయారు. ఎక్కెడక్కడో స్థిరపడిపోయారు. వీరంతా మళ్లీ ఒక చోట కలుసుకొని పాఠశాల రోజులను నెమరేసుకొన్నారు. వీరిలో ఏపీ ఎండీసీ చైర్‌పర్సన్ గుండ్లూరి షమీం అస్లాం, తెట్టు మాజీ సర్పంచు కామకోటి ప్రసాద్‌రావులు సమావేశానికి ఏర్పాట్లు చేశారు. వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు సందడి చేశారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



సుదర్శన్‌నాయక్

తంబళ్లపల్లె: స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సుదర్శన్‌నాయక్ రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో ప్రతిభచాటాడు. శుక్రవారం శ్రీకాకుళం కోడిరామూర్తి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నాడు హైజంప్ 1.7 మీటర్లలో తృతీయస్థానం దక్కించుకుని శభాష్ అనిపించుకున్నాడు. జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక కావడం విశేషం. ప్రతిభ చాటిన విద్యార్థిని ఆదివారం ఎంఈవో త్యాగరాజు, ఎంపీడీవో ఆనంద్‌కుమార్, తహశీల్దార్ కళావతిలు అభినందించారు.

బీజేపీ పటిష్టతపై ప్రత్యేక శ్రద్ధ

కురబలకోట: రాష్ట్రంలో బిజేపీ పటిష్టతకు కేంద్ర నాయకత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని ఆపార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌చార్జి సాయి లోకేష్ పేర్కొన్నారు. అంగళ్లులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రైల్వేలైన్ ఇతర సమస్యలపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శ్రద్ధ వహిస్తానన్నారు. ధర్మవరం-పాకాల రైల్వే మార్గం డబుల్ లైన్, కురబలకోటలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆగేందుకు చొరవ చూపుతానన్నారు. బెంగళూరుకు అనుసంధానంగా ఐటీ ఆధారిత పరిశ్రమ స్థాపనకు కూడా కేంద్రం దృష్టికి తీసుకెళతానన్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

నిబంధనలకు లోబడి మద్యం విక్రయించాలి

పీలేరు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనలకు లోబడి మద్యం విక్రయాలు జరపాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా మద్యం డిపో ఎస్‌ఐ రామకృష్ణ శాస్త్రి అన్నారు. ఆదివారం పీలేరు ఎక్సైజ్ పరిధిలోని చిన్నగొట్టిగల్లులో మద్యం దుకాణాలు తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, నమోదు వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత ధరలకు మాత్రమే మద్యం విక్రయించాలని, ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెడ్డెమ్మకొండ ఆలయానికి రూ. 50వేల విరాళం



చెక్కును అందజేస్తున్న డీఈ రెడ్డెప్పరెడ్డి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి దాతలు రూ. 50,116 విరాళంగా అందజేశారు. రెడ్డెమ్మకొండలో నూతనంగా ఆలయం పునర్నిర్మాణ పనులు చేపట్టారు. తిరుపతి పట్టణానికికు చెందిన ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ రెడ్డెప్పరెడ్డి ఆదివారం ఆలయానికి చేరుకొని ఆలయ నిర్మాణానికి తనవంతుగా సాయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డికి అందజేశారు. దాతకు ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇతర రాష్ట్రాల నుంచి టమాట దిగుమతి

ములకలచెరువు: ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డుకు మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి టమాటలు వచ్చాయి. వారం రోజుల నుంచి మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతుండడంతో పలువురు వ్యాపారస్తులు ఇతర రాష్ట్రాల నుంచి టమాటలు దిగుమతి చేస్తున్నారు. 800 బాక్సుల టమాటలు మార్కెట్‌కు వచ్చినట్లు మండీ యజమానులు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

గుర్రంకొండ: మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలశాఖ అధ్యక్షులు యూసూఫ్‌సాహెబ్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ కొసం ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చాంద్‌బేగ్, సంఘం నాయకులు మహబూబ్‌అలీఖాన్, రెడ్డెప్పలు పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా ధ్వజారోహణం, పల్లకీ ఉత్సవం

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం అర్చకులు క్రిష్ణప్రసాద్ బటార్, రాఘవేంద్రస్వామి, రమేష్‌బాబులు సంప్రదాయ బద్ధంగా ధ్వజారోహణం, పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ, సంగీతం, బజన కార్యక్రమాలు భక్తులను ఆలరింపజేశాయి. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిచంగలరాయుడు, రవి పాల్గొన్నారు.



ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 25న కలెక్టరేట్ల వద్ద దీక్ష

మదనపల్లె : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జనవరి 25న కలెక్టరేట్ల వద్ద జరిగే దీక్షను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్‌కుమార్ కోరారు. ఆదివారం మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థలు అన్నింటినీ పథకం ప్రకారం కార్పొరేట్లకు లబ్ధి కలిగించేందుకు ప్రైవేటీకరణ దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. అందులోభాగంగా లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేందుకు తహతహలాడుతున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కలెక్టరేట్ల వద్ద సీపీఐ-ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మద్దతు తెలిపిందన్నారు. ఈ సందర్భంగా జనవరి 27విశాఖలో జరిగే కార్మిక మహాగర్జనకు మద్దతుగా, రాష్ట్రవ్యాప్తంగా జనవరి 23, 24 తేదీల్లో రెవెన్యూ డివిజనల్ ఆఫీసుల వద్ద జరిగే ఆందోళనలు, 25న కలెక్టరేట్ వద్ద జరిగే దీక్షలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, శేఖర, నందు, వనజమ్మ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

టమాట రైతుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

గుర్రంకొండ: గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతులకు పెండింగ్‌లో ఉంచిన టమాట పట్టీలకు సంబంధించిన బకాయిలను మండీ యజమానులు వెంటనే చెల్లించాలని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, కార్యదర్శి జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. టమాట మండీల యజమానులు పలువురు రైతులకు టమాట విక్రయాలకు సంబంధించిన పట్టీల డబ్బులు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఈవిషయమై ఇటీవల పలువురు రైతులు తమకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. మండీ యజమానులు నెలల తరబడి బకాయిల డబ్బుల కొసం రైతులు తిప్పుకొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో టమట డబ్బులు చెల్లించే విషయమై ఘర్షణలు కూడా చోటు చేసుకొన్న విషయాలు గుర్తుంచుకోవాలన్నారు. ఇకమీదట రైతులు తమకు ఫిర్యాదు చేస్తే మండీ యాజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్‌కమిటీ చైర్మన్ రవినాయక్, కార్యదర్శి జగదీష్

వేగంగా బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు



బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు

పీలేరు : మదనపల్లె - తిరుపతి ఫోర్‌లేన్ జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా పీలేరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారి మదనపల్లె - తిరుపతి మధ్య ఫోర్‌లేన్ విస్తరణ పనులకు రూ. 1852 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తొలివిడతలో మదనపల్లె - పీలేరు మార్గంలో 55.9 కిలోమీటర్ల రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ముందుగా పీలేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కడప మార్గం నుంచి తిరుపతి రోడ్డు మార్గం బండకిందపల్లె వరకు బైపాస్ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. యుద్ధ ప్రాతిపదికన మట్టితోలకం, చదును చేయడం పనులు చేపట్టారు. బైపాస్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతుండడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె - తిరుపతి మార్గంలో వెళ్లాలంటే పీలేరు పట్టణంలో ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంది. దీంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పీలేరు బైపాస్‌తోపాటు పట్టణంలో రెండు ఆర్వోబీలు మంజూరు చేయించారు.